క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న డీఎం రమేశ్‌బాబు

కొడంగల్: మండల పరిధిలోని ఖాజా అహ్మద్ పల్లి గ్రామంలో బోయ కమలమ్మ రెండేళ్ల క్రితం గుండెపోటుతో చనిపోయింది. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఆమె బీమా చేయించడం వల్ల రూ.2లక్షల క్లెయిమ్ మంజూరైంది. ఈ చెక్కును డివిజనల్ మేనేజర్ రమేశ్‌బాబు శుక్రవారం మృతురాలు భర్త వెంకటయ్యకు అందజేశారు. బీమా చేసుకుంటే బాధిత కుటుంబానికి ఆసరాగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ యూనిట్ మేనేజర్ సతీష్, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, నయీమ్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్

కొడంగల్ రూరల్: వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం దివ్యాంగులకు పెన్షన్ రూ. 6వేలు ఇవ్వాలన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో దివ్యాంగులు నిరసన చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని, నవంబర్ 20వ తేదీ నుంచి డిసెంబర్ 9వరకు దశల వారీగా ఆందోళన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జీఓ నెంబర్ 17ను వెంటనే రద్దు చేయాలని, ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ప్రతీ నెల 5వ తేదీలోపు పెన్షన్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సిములు, సావిత్రమ్మ, నారాయణ, రాములమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సన్నరకం ధాన్యం కొనుగోలు ప్రారంభం



సన్నరకం వడ్లను గుర్తించే యంత్రం

దౌల్తాబాద్: మండలంలోని అంతారం గ్రామంలో సన్నరకం ధాన్యం కొనుగోలును స్థానిక కో ఆపరేటివ్ కార్యాలయ సిబ్బంది మొదలు పెట్టారు. ధాన్యం అమ్మేందుకు వచ్చిన రైతుల వద్ద గింజలను తీసుకుని గిరాటులో వేసి పొట్టు తీసిన తర్వాత సన్నరకం గుర్తించే యంత్రంలో వేసి పరీక్షిస్తారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్నవాటిని తీసుకుంటామని, వ్యత్యాసం ఉంటే వాటిని నిరాకరిస్తామని నిర్వాహకులు తెలిపారు.

24న బ్రహ్మజ్ఞాన్ దివస్

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని నాగసాన్‌పల్లి సమీపంలో వెలసిన క్వాంటం లైఫ్ ఫౌండేషన్‌లో బ్రహ్మజ్ఞాన్ దివస్ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి పవన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి వివిధ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ సెక్రెటరి శైలజా రామయ్యా తదితరులు హాజరౌతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలంతా హాజరై విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

మురుగు తొలగింపు



జేసీబీతో శుభ్రం చేయిస్తున్న రాధ

దుద్యాల్: మండల పరిధిలో కుదురుమల్ల గ్రామంలోని 6వ వార్డులో మురుగు కాలువ నిండుకుని దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో కాలనీ వాసులు విలేకరుల సమావేశంలో తమ ఆవేదన వెలిబుచ్చారు. శుక్రవారం ఉదయం ఫిర్యాదు చేయగా దీన్ని గమనించిన కాలనీ ముఖ్య నాయకుడు, పంచాయతీ కార్యదర్శి రాధ ఆధ్వర్యంలో కాలువలో పేరుకుపోయిన మురుగును తొలగించారు.

ఓటు నమోదు చేసుకోండి

తహశీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్: ఈ నెల 23, 24వ తేదిల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు ఫారాలు లభిస్తాయని తెలిపారు. జనవరి 1వ తేది నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని వార్డుల్లోని పోలింగ్ బూతుల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ అవకాశాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మత్స్యకార భవనం ఎదుట కాల్వలో చేరిన మురుగు



పేరుకుపోయిన చెత్త

మురుగు తీశారు.. చెత్త వదిలేశారు!

- మత్స్యకార భవనం కాల్వ వద్ద పేరుకుపోతున్న చెత్త
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు
- పట్టించుకోని అధికారులు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో మత్స్యకార భవనం ఎదుట మురుగు కాల్వలోని మురుగును తొలగించారు. కానీ చెత్త మాత్రం ఎత్తలేదు, అక్కడే ఉంచేశారు. మురుగు కాల్వ పక్కనుంచి వెళితే అక్కడ దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. పేరుకుపోతున్న చెత్త కుప్పలతో దోమలు వ్యాప్తి చెంది, రాత్రిసమయాల్లో అవి కుడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక తాము రోగాల బారిన పడాల్సి వస్తుందని వాపోతున్నారు. గత కొంత కాలంగా మురుగు కాల్వలోని మురుగును తొలగించి శాశ్వత పరిష్కారం చేయడం లేదని కాలనీ వాసులు చెబుతున్నారు. ఈ విషయంలో పలు మార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీ వాసులు ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలి

కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్

కుల్కచర్ల: విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలని కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్ పేర్కొన్నారు. ఎలాంటి అంశంలోనూ నిర్లక్ష్యానికి తావివ్వొద్దని ఆయన అన్నారు. శుక్రవారం కులకచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సరళమైన బోధనాపద్ధతిలో పాఠ్యంశాలను చెప్పడంతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ కూడా నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీధర్

కోస్గి-దౌల్తాబాద్ రోడ్డుకు మరమ్మతులు

దౌల్తాబాద్: మండలంలోని దౌల్తాబాద్ నుంచి కోస్గి వెళ్లే డబుల్‌రోడ్డుకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దౌల్తాబాద్ నుంచి చల్లాపూర్ గ్రామం వరకు ఏర్పడ్డ చిన్న చిన్న గుంతలను పూడ్చడానికి రూ.40వేలు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. దీంతో అక్కడక్కడ ఏర్పడ్డ గుంతల్లో తారువేసి మరమ్మతు పనులు నిర్వహించారు. చల్లాపూర్ నుంచి కోస్గి వరకు ఏర్పడ్డ గుంతలను కూడా పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



బాస్‌పల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

విద్యాబోధనలో నిర్లక్ష్యం తగదు

- ఎంపీడీఓ మహేశ్‌బాబు
- పాఠశాలలో రికార్డుల పరిశీలన

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల విద్యా బోధనలో ఉపాధ్యాయులు ఎలాంటి నిర్లక్ష్యం చూపొద్దని ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా పరిసరాలను పరిశీలించిన ఆయన తదనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థి క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న ప్రతి పాఠాన్ని శ్రద్ధతో వింటూ మంచి ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి కలలు కన్న ఆశయాల కోసం చదువుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, ఉపాధ్యాయులు సమీరా, అంగన్‌వాడీ టీచర్ సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం

కుల్కచర్ల: లగచర్లలో గిరిజన రైతులకు నష్టం కలిగేలా భూములను స్వాధీనం చేసుకోవాలని చూస్తే ఊరుకునేదిలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లదరావు, దిశ కమిటీ సభ్యులు జానకిరాం చౌహన్ పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో నిరుపేద కుటుంబాలకు చెందిన భూములను స్వాధీనం చేసుకోవాలని కొంతమంది కంపెనీల పేరుతో ప్రయత్నించడం బాధాకరమని తెలిపారు. బతుకుదెరువు కోసం వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న గిరిజన రైతులకు నష్టం కల్గించే ఎటువంటి ఫార్మ కంపెనీలు వారికి అవసరంలేదన్నారు. అన్నం పెట్టే ఏదైనా కార్యక్రమాలు నిర్వహించాలే తప్పా వాటి ఏర్పాటు కోసం ఉన్న ఇల్లు, పొలం వదిలిపెట్టేదైతే అవి తమకొద్దని గిరిజనులు వాపోతున్నారన్నారు. ఈ కంపెనీలతో తమకెటువంటి ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది నిరుపేద గిరిజనుల భూములను ఆక్రమించాలన్న దురుద్దేశంతో కంపెనీ నిర్వాహకులతో డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. గిరిజన ప్రజలకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తిలేదని, రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యులు ఘనపురం వెంకటయ్య, మహిళ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సామ్యారెడ్డి, మండల అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి గుడాల వెంకటయ్య, జిల్లా కార్యవర్గసభ్యులు మైపాల్, ఓబీసీ జిల్లా కార్యదర్శి చంద్రలింగం, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు మహేశ్ నాయక్, కార్యదర్శి కొండ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు పెరుమాళ్ల వెంకటేష్, బాయికాడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి

మాజీ ఎంపీపీ కరుణ

బషీరాబాద్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదవాలని బషీరాబాద్ మాజీ ఎంపీపీ కరుణ పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాల సాధనకు ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సూచించారు. చిల్డ్రన్స్‌డే పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. లక్ష్యాలను సాధించడానికి కఠినంగా కృషి చేయాలన్నారు. ప్రగతిని పర్యవేక్షించుకొని, ఎప్పటికప్పుడు మార్పులు చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హీర్యానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బషీరాబాద్: బహుమతులు ప్రదానం చేస్తున్న కరుణ

కుల్కచర్లలో..

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠ్య బోధనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు.



కుల్కచర్ల: ముజాహిద్‌పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

సమగ్ర విచారణ చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం


అనంతగిరి: బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల్, కొడంగల్ పరిధిలో నూతన ఉపాధ్యాయులకు కొడంగల్ ఎస్‌టీఓ ఎంప్లాయిస్ ఐడీ, పాన్ నంబర్ ఇప్పించేందుకుగాను డబ్బులు వసూలు చేస్తున్నారని వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ డీటీఓకు ఆయన వినతిపత్రం అందజేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలి

నవాబుపేట: డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శివరాజ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మూలమాడ, ఎకుమామిడి గ్రామాల్లో శుక్రవారం మాలల సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్ రిలీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. డిసెంబర్ ఒకటి నిర్వహించనున్న మాలల సింహ గర్జనను ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని కోరాడు. మండల అధ్యక్షుడు శ్యామయ్య, ప్రధాన కార్యదర్శి నర్సింలు, ఆనందం, అంజ య్య, ప్రకాశం నర్సింలు, శాంతయ్య, బాలరాజ్, ప్రకాశం, రత్నం, నర్సింలు, శివకుమార్. తదితరులు పాల్గొన్నారు



సీతారాంపూర్‌లో నిర్వహించిన అయ్యప్ప పూజలో పాల్గొన్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి



సురంగల్‌లో మొక్క నాటిన అయ్యప్ప భక్తులు

దైవ చింతనతో ప్రశాంతత

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని రామన్నగూడలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకుడు దయాకర్ ఏర్పాటు చేసిన అయ్యప్ప పడి పూజకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తి భావాలను అలవర్చుకోవాలని సూచించారు. నర్సింగ్ రావు బృందం ఆలపించిన అయ్యప్ప భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీసీ ఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి, శైలజ, ఆగిరెడ్డి, పి. ప్రభాకర్, డాక్టర్ వైభవ్‌రెడ్డి, శంకర్, క్రిష్టారెడ్డి, మానిక్యరెడ్డి, శేఖర్, శివప్రసాద్, వెంకటేశ్, ఇంద్రాసేనారెడ్డి, ప్రభాకర్, మాదవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీతారాంపూర్‌లో..

షాబాద్: మండల పరిధిలోని సీతారాంపూర్ మాజీ ఉప సర్పంచ్ కటిక సందీప్‌స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ పట్నం అవినాశ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వాములు చేసిన అయ్యప్ప నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాండురగారెడ్డి, స్వాములు సురేశ్‌గౌడ్, సురేందర్, జగన్, శివ, దుగేశ్, ప్రశాంత్‌రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులున్నారు

మొక్కలు నాటిన అయ్యప్పలు

మొయినాబాద్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం బాధ్యతాయుతంగా చేపట్టాలని అయ్యప్ప భక్తుడు, గురుస్వామి రవీందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సురంగల్ అయ్యప్ప సన్నిధానం, మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాల్లో శుక్రవారం కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు శోభన్‌రెడ్డి, శివ, విజయ్‌గౌడ్, జగన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, సాయికిరణ్ రెడ్డి, అంజియాదవ్, పవన్‌రెడ్డి, రాజారెడ్డి, మాణిక్ రెడ్డి, అరవింద్‌రెడ్డి, మధురెడ్డి, జ్ఞానేశ్వర్‌యాదవ్, ప్రదీప్, మహేందర్, సురేష్, హరీష్, గణేష్, సాయి తదితరులు ఉన్నారు.



రామన్నగూడలో నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న సబితారెడ్డి తదితరులు

చదువుపై పట్టు సాధించాలి

- హెచ్‌ఎంలు గోపాల్, లక్ష్మయ్య

చేవెళ్ల: పాఠశాల స్థాయిలోనే చదువుపై పట్టు సాధించాలని తంగడపల్లి, కౌకుంట్ల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గోపాల్, లక్ష్మయ్య విద్యార్థులకు సూచించారు. వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8, 9,10 తరగతుల విద్యార్థులకు శుక్రవారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలా చదువుకోవాలి..? భవిష్యత్‌లో ఎలా రాణించాలి అనే అంశాలను వివరించారు. తెలిసీ తెలియని వయసులో ఉండే విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ భద్రయ్య, కెరీర్ గైడెన్స్ ట్రైనర్ మహేశ్ కుమార్, మేనేజర్ పవన్‌కుమార్, రమేశ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



కౌకుంట్ల జెడ్పీ హెచ్‌ఎస్‌లో మాట్లాడుతున్న శిక్షకులు మహేశ్‌కుమార్

పరామర్శ

మొయినాబాద్: ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి శుక్రవారం పరామర్శించారు. మొయినాబాద్‌కు చెందిన ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవూఫ్ తల్లి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌గౌడ్ తల్లి ఇటీవల మృతిచెందారు. దీంతో రవూఫ్‌తో పాటు మోహన్‌గౌడ్, వారి కుటుంబ సభ్యులను కలిసిన సబితారెడ్డి ధైర్యం చెప్పారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, షేక్ మహబూబ్, దేశమొళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.